# పేరు మీరే పెట్టండి

అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బావుంటుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.

సూపర్‌బజార్‌కెళ్ళి సరుకులు తెచ్చుకుందామని సుజాత బస్టాప్‌లో నిలబడింది. ఎంతకీ బస్ రావటంలేదు. పక్కనే నిలబడి ఉన్న మరో యువతిని పలకరించింది. "ఎందాక వెళ్తున్నారు ?" అంటూ.

"ఆఫీస్‌కే నండి. బస్ మిస్సవుతేనూ, మరో బస్‌కోసం వెయిట్ చేస్తున్నాను" అన్నది ఆ యువతి. అలా అలా కబుర్లు దొర్లాక "ఇంతకీ మీరే ఆఫీస్‌లో పనిచేస్తున్నారు ?" అంది మళ్ళీ సుజాత.

"సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్‌లో నండి."

"ఏమిటి సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డులోనా ? ! మీకు రామారావుగారు తెలుసా ?" మళ్ళీ అడిగింది సుజాత.

"భలేవారే ! రామారావు తెలియకపోవడమేమిటి !" అంటూ పకపకా నవ్వింది ఆమె.

అంతగా నవ్వాల్సిన అవసరమేమిటో అని ఆలోచిస్తున్న సుజాతను చేత్తో తడుతూ ఆమే అంది.

"ఆ నడక, ఆ ముఖం, ఆ మాటలు ఒక్కసారి విన్నవారు తిరిగి మరచిపోగలరా ? బఫూన్ చేష్టలతో అందరిని ఒకటే నవ్విస్తుంటాడు. పూర్ ఫెలో ! ఎదుటివాళ్ళు కాస్త నవ్వంగానే చాలు మరింత విజృంభించి మాట్లాడుతుంటాడు. నిజం చెప్పాలంటే ఒక్కొక్కసారి మరీ జిడ్డులాగ పట్టుకుని ఎంతకీ వదలడండి."

"ఒకసారేమయిందనుకున్నారు ! ఇంతోటి గొప్ప అందగాడు మా కొలీగ్‌కి లవ్‌లెటర్ రాశాడండి. అది అందరికి చూపించి ఒకటే నవ్వడం చేసింది. చివరికి ఆఫీసర్‌కిస్తానని బెదిరించేసరికి అందరి ముందు క్షమాపణ చెప్పుకున్నాడు. ఇక అప్పటినుంచి చూడండి అందరూ అతన్ని ఒకటే ఆడిస్తుంటారు."

ఇంతలో బర్రుమని శబ్దంచేస్తూ నాంపల్లి పోయే బస్ వచ్చింది.

"ఇంతకీ రామారావు మీకెలా తెలుసో చెప్పనేలేదు" అంది ఆమె.

"ఆయన మా ఆయన !" కోపంతో ఎర్రబడిన మొఖంతో అంటూ గబుక్కున బస్ ఎక్కింది సుజాత.

**– అరసూర్ శ్యామసుందర్**

(హైదరాబాద్)

*స్రవంతి నెం: 19లో ఈశీర్షికలో ప్రచురించిన కథకి రచయితలు*

– కె.రఘుపతి, పి. చిలుకారావు

**పెట్టినపేరు : కృతజ్ఞత**

*ఈవారం ఈ శీర్షికలో కథల ఎన్నికల గెస్ట్ ఎడిటర్ : శ్రీ రేవూరు అనంతపద్మనాభరావు*



గత రెండున్నర దశాబ్దాలుగా ఆంధ్రసాహితీ క్షేత్రాన్ని సస్యశ్యామలం చేస్తున్న శ్రీపద్మనాభరావు, ఇరవై పుస్తకాలకు పైగా రచించారు. కవితలు, కథలు, సాహితీ, విమర్శనా, పరిశోధనా వ్యాసాలు.... ఒకటేమిటి అన్ని ప్రక్రియల్లోనూ వీరిది అందెవేసిన చెయ్యి కాబట్టే అన్ని దిన, వార, పక్ష, మాస పత్రికలు వీరి సాహితీ సౌరభాలను అఖిలాంధ్ర కోటికి అందించాయి. వృత్తిరీత్యా ఆకాశవాణిలో అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టరయినా ప్రవృత్తిరీత్యామాత్రం సాహితీ స్రష్ట, ద్రష్ట రెండూను.

"ఒకే వాక్యం ఆధారంగానైనా, కథకులు ఎంచుకున్న మార్గాలు మాత్రం.... ఎంతో విభిన్నంగా ఉన్నాయి. శైలి, భావ వ్యక్తీకరణ ఒక్కో తరహాగా ఉండి విభిన్నరుచుల్ని విరజిమ్మాయి. నాకు నచ్చిన రెండు కథలు–"లోకం తెలియని ఆలోక", "ఆ వ్యక్తి" మీరూ చదివి నాఅభిప్రాయంతో ఏకీభవిస్తారని ఆశిస్తున్నాను"

"ఎన్నికైన కథా రచయితలతోపాటు, పాల్గొన్న వారందరికీ నా అభినందనలు."

# ఆ వ్యక్తి

హుషారుగా ఈలవేస్తూ డ్రైవ్ చేస్తూ నవ్వుకున్నాడు డాక్టర్ ప్రశాంత్.

ఈరోజు కాస్త ముందుగానే వచ్చెయ్యమంది శ్వేత.

"స్టేట్స్ నుండి కరుణా ఆంటీ, రంగనాథ్ అంకుల్ వచ్చారు. మన శిరీషనుకూడా కాన్వెంట్ నుండి తెచ్చేస్తారని మామగారు వెళ్ళిపోయారు. మీరు త్వరగా వచ్చేస్తే వాళ్ళ అబ్బాయిని పరిచయం చేస్తురుట. మరి మీరు లేట్ చేయకుండా వచ్చేస్తే మీరూ, నేనూ కలిసి వాళ్ళింటికి వెళ్ళాలి. అందరం కలిసి ఫస్టుషోకి పిక్చర్ ప్రోగ్రామ్ ఉంది. మరి వచ్చేస్తారుగా?" అంటూ ప్యూన్ చేత లెటర్ పంపింది శ్వేత.

మరి తను పది నిమిషాలు లేట్ చేసేశాడు. శ్వేత ఏమంటుందో అనుకుంటూ నెమ్మదిగా కారును పార్క్ చేసి కారు హారన్ కొట్టాడు. రోజూ "డాడీ." అంటూ ఎదురొచ్చే శిరీష ఈరోజు ఎందుకు రాలేదు చెప్మా?" అనుకుంటూ తాళం చెవులూపుకుంటూ మెట్లెక్కసాగాడు ప్రశాంత్.

కర్టెన్ తొలగించి లోపలికి అడుగుపెట్టాడు.

"ఏమండీ మన శిరీష...."

"ఊc శిరీష.... శిరీష కేమయింది?" కంగారుగా ప్రశ్నించాడు.

"మన శిరీష...."

"చెప్పు శ్వేత! శిరీషకి ఏం జరిగింది?" భుజాలు పట్టుకుని కుదిపాడు.

"ఏం జరగలేదండీ మన శిరీషను అచ్చం మీలాగే ఉన్న వ్యక్తి ఎవరో కాన్వెంట్ మధ్యలో లెసన్ జరుగుతుండగా టీచర్‌నడిగి తీసుకుపోయారటండీ."

"ఏమిటి శ్వేతా నువ్వనేది నాలాంటి వ్యక్తా?"

"అవునండీ."

"అచ్చం నా లాగే ఉన్నాడా? నో.... ఇది అసంభవం."

ఆ హాలు అదిరేలా అరిచాడు ప్రశాంత్ కోపంగా.

అప్పుడే కారు లాక్ చేసి తన గది లోనికి అడుగుపెడుతున్న లాయర్ రాధాకృష్ణగారు "డాడీ– మన శిరీషను మీరు తీసుకురాలేదా?"

ఆత్రంగా అడుగుతున్న ప్రశాంత్‌ను మధ్యలోనే అడ్డు తగిలి, "మామగారూ! మన ఎదురింటి బేబీ చెప్పిందండీ. "ఆంటీ అంకుల్ వచ్చి శిరీషను తీస్కెళ్ళిపోయారు ఎందుకు?" అని నన్నడిగిందండీ. అంకుల్ ఎప్పుడూ అలా విస్పెన్సరీనొదిలేసి మధ్యలో రారు" అని చెప్పానండీ. "నిజం! ఆంటీ. అచ్చం అంకుల్ లాగే ఉన్నారు" అంది. నేను వెంటనే కాన్వెంటుకెళ్ళి కనుక్కుంటే తెలిసింది మామగారూ! అచ్చం ఆయన లాంటి వ్యక్తే తీస్కెళ్ళారని" అంది వెక్కుతూ.

ఆగకుండా చెప్తున్న శ్వేతను, కంగారుగా చూస్తున్న ప్రశాంత్‌ను చూస్తూ "రంగనాథ్ కొడుకు దీపక్ తీసుకెళ్ళాడు ప్రశాంత్! దానికే ఇంత కంగారు పడిపోయారా?" అంటూ చిర్నవ్వు నవ్వారు.

"అచ్చం నాలాగే ఉన్న వ్యక్తి...."

"ఆగు ప్రశాంత్! దీపక్ అచ్చం నీలాగే ఉంటాడు."

"అదెలా సంభవం డాడీ?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు ప్రశాంత్.

అతను మౌనంగా కిటికీ దగ్గరకెళ్ళి అవతలకి చూస్తూ చెప్పసాగారు.

"చిన్నప్పటి నుండీ ప్రాణ స్నేహితులం నేనూ రంగనాథ్. కలిసి చదువుకున్నాం. ఇంచుమించుగా పెళ్ళిళ్ళు కూడా ఒకేసారి జరిగాయి. కానీ నేను లాయర్నయ్యాను, వాడు డాక్టరయ్యాడు. మీ అమ్మ, రంగనాథ్ భార్య ఒకేసారి గర్భిణీ అయ్యారు. వారం రోజుల తేడాతో ఇద్దరూ ప్రసవించారు. దురదృష్ట వశాత్తు రంగనాథ్ కొడుకును పోగొట్టుకున్నాడు మీ అమ్మ కవలపిల్లలను కని నన్ను విడిచి వెళ్ళిపోయింది. ఆ కవలపిల్లలే నువ్వు, దీపక్. రంగనాథ్ బాధ చూడలేక అన్నింటిలోనూ చెరిసగం పంచుకుంటున్న మేము మిమ్మల్ని కూడా సమానంగా పంచుకున్నాం. కమలకి తెలివి రాక ముందే బాబుని పక్కలో పెట్టేశాను. ఆ బాబు తన బిడ్డె అని ఇప్పటికీ అనుకుంటుంది. కొన్ని రోజులకి వాళ్ళు స్టేట్స్ వెళ్ళిపోయారు" అంటూ ఆగి ఇటు తిరిగి-

"నేను ఇందాక రంగనాథ్ ఇంటికి వెళ్ళి వచ్చేస్తూ అన్నాను." కాన్వెంటు కెళ్ళి శిరీషను తీసుకురావాలి. ఇంటిదగ్గర కోడలొక్కత్తే ఉంటుందని. "మీరు ఇంటికెళ్ళండి అంకుల్! పాపను నేను తీస్కొని వచ్చేస్తాను." అంటూ దీపక్ కారు తీసుకుని కాన్వెంటుకెళ్ళాడు. ఇప్పటికి వచ్చేస్తూనే ఉండాలి. ఏ షాపుకో వెళ్ళి ఉంటారు" అంటూండేసరికి కారు హారన్ విన్పించింది.

రాధాకృష్ణగారు "అమ్మా జ్యోతీ! నువ్వూ, ప్రశాంత్ కూడా ఎప్పటికీ ఈ విషయం కమలా ఆంటీ దగ్గర ఎత్తవద్దేం" అన్నారు.

"హాయ్ డాడీ.... మమ్మీ వచ్చేశాను. డాడీ! ఈ అంకుల్ అచ్చం నీలాగే ఉన్నారు కదూ....' అంటూ ఇంకా ఏదేదో గడగడా వాగేస్తూ ఉంది శిరీష.

కానీ శ్వేత, ప్రశాంత్ చూపులు మాత్రం దీపక్‌నే ఆసక్తిగా చూస్తున్నాయి.

**కుమారి వై. జ్యోతి**
(పార్వతీపురం)

---

ప్రవంతి నెం: 17లో ఇచ్చిన

**"అచ్చం నాలాగే ఉన్నాడా? నో! ఇది అసంభవం" ఆ హాలు అదిరేలా అరిచాడు ప్రశాంత్ కోపంగా.**

వాక్యం ఆధారంగా రాసినకథలు.

# లోకం తెలీని అలోక

ఓ గంట నుండి బాల్కనీలో పచార్లు చేస్తూ ఆలోచిస్తుంది అలోక. తన ఆలోచనలు ఒక కొలిక్కి రావడంలేదు. తను రెండు గంటల క్రితం చూసిన సంఘటనే గుర్తుకువస్తూంది. రెండు గంటల క్రితం తను షాపింగ్ కని బయలుదేరి, మధ్యలో ఒక స్నేహితురాలు కలవటంతో రెస్టారెంట్‌కు వెళ్ళవలసి వచ్చింది. రెస్టారెంట్‌లోకి ప్రవేశిస్తుండగా దూరంగా గమనించింది, తన భర్త ప్రశాంత్. ఒకావిడతో చేతిలోచేయి కలిపి బయటికి వచ్చి వెంటనున్నామెతో కార్లో వెళ్ళిపోయాడు. వాళ్ళిద్దరూ బాగా నవ్వుకొంటున్నారు. కార్లో వెళ్ళేటప్పుడు తన భర్త ఆమెను ప్రక్కన కూర్చోబెట్టుకుని ఆమెమీద ఒక చేయి వేశాడు. తన భర్తను ఆ పరిస్థితిలో చూసిన అలోక, షాక్ తిన్నట్టు అయింది. ఆ షాక్ నుండి తేరుకొనేలోపే వాళ్ళ కారు కనుమరుగైపోయింది. అలోక వెంటనే తేరుకుని తన స్నేహితురాలు అక్కడే వుందన్న విషయం కూడా మరిచిపోయి తన కారు స్టార్టు చేసి ముందుకు వెళ్ళిపోయింది. ప్రశాంత్‌ని ఫాలో అవుదామనే ఆమె ఉద్దేశ్యం ఫలించలేదు. వాళ్ళ కారు ఎటు వెళ్ళిందో తెలియలేదు. విసిగి వేసారిన అలోక తిరిగి ఇంటికొచ్చేసింది. కాలు కాలిన పిల్లిలా అటూ ఇటూ పచార్లు చేస్తూంది. అంతలో బయటకారు హారను విని హాల్లోకొచ్చింది. సూట్ కేసుతో హాల్లోకొచ్చాడు ప్రశాంత్. ఎదురుగా అలోక.

"హల్లో అలోక డియర్, నీకొక గుడ్ న్యూస్"

"................................"

"అదేమిటంటే రేపు మనం కాశ్మీర్ వెళుతున్నాం. అక్కడ కొన్ని డాక్యుమెంట్లపై సంతకాలు కావాలని మేనేజర్ ఫోన్ చేసి చెప్పాడు. నీవు కాశ్మీర్ చూడలేదుకదా, అందుకని, రెండు టిక్కెట్లు బుక్ చేయిందాను" అన్నాడు.

"......................" మౌనం.

"ఏయ్ ఏమిటి? నేనే వాగుతున్నాను, నీవేమీ మాట్లాడవేమిటి?" అడిగాడు ప్రశాంత్ అలోక గడ్డం పైకెత్తుతూ.

విసురుగా తల పైకెత్తింది అలోక. కళ్ళల్లో నిప్పులు కురుస్తున్నట్టుగా అనిపిస్తుంది.

"మీరివాళ మూడుగంటల ప్రాంతంలో ఎక్కడున్నారు?"

"మూడు గంటల ప్రాంతంలో... ఆఁ.... బాంబే పార్టీతో ఓ టెండర్ విషయమై మాట్లాడుతూ ఆఫీసులో వున్నాను. ఏం ఎందుకని?"

అలోక ముఖం ఎర్రగా కందిపోయింది.

"నో అప్పుడు మీరు ఒక వగలాడితో కారుపై షికార్లు కొడుతూవున్నారు. మీరు ఆమెతో రెస్టారెంటులో నుంచి బయటికి వస్తుండగా నేను స్వయంగా చూసాను."

"ఏమిటి నీకు పిచ్చిపట్టలేదు కదా?"

"కాదా మీరు దానితో తిరగటంకోసం వేరే కారు ఉపయోగించారు. అంతేకాదు, ఈ సూటు కూడా మార్చి వేరేసూటు వేసుకున్నారు. నావైపు చూడకుండానే వెళ్ళిపోయారు." అంది ఏడుస్తూ.

"కాదు అలోకా... ప్లీజ్ నేను మూడు గంటలకు ఆఫీసులోనే వున్నాను. కావాలంటే ఆఫీసుకు ఫోన్‌చేసి తెలుసుకో. అలాగే నా డైరీ చూడు ఇవాళ మూడుగంటలకు బాంబేపార్టీతో అపాయింట్‌మెంట్ ఉందో లేదో" అని అన్నాడు. అలోక ఫోన్‌చేసి తెలుసుకొంది. అతను చెప్పేది నిజమేనని రూఢి అయింది. కొద్దిసేపటికి తను చూసిన సంఘటన వివరంగా చెప్పింది అలోక.

"ఏమిటి నువ్వనేది? అచ్చం నా లాగే ఉన్నాడా! నో ఇది అసంభవం" హాలు అదిరేలా అరిచాడు ప్రశాంత్ కోపంగా.

"నన్ను క్షమించండి ఎవర్నో చూసి మీరను కున్నాను." అంది అలోక.

"ఇట్సాల్ రైట్ ఇందులో నీతప్పులేదు కదా?" అని సమర్థించాడు ప్రశాంత్. కాని పాపం అలోకకు తెలియదు, ప్రశాంత్‌కు ఒక చిన్న ఇల్లు ఉందని, ఆ రెస్టారెంట్‌వద్ద కలిసింది తన భర్తేనని పాపం పూర్ క్రియేచర్ అలోక.

**— ఎం.డి. మగ్బుల్ పాషా**
(వరంగల్)

---

## ఓకథ రాయండి

ఈ క్రింది ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథరాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయలు పారితోషికం పంపబడుతుంది.

**"ఇది నాలుగోసారి; ఈసారి చూసినా నీ ఆత్మహత్యా ప్రయత్నానికి నే నడ్డు రాను" అన్నాడు శాయి లక్ష్మితో.**